క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

దేవరకొండ: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం దేవరకొండ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన కంబాలపల్లి తిరుపతయ్యకు ముగ్గురు కుమారులు. తిరుపతయ్య తన భార్య, పెద్ద కుమారుడితో కలిసి చందంపేట మండలంలోని నల్లచెలమూలలో ఉంటూ కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమారులు ఇద్దరూ దేవరకొండలో ఉంటూ ఆటోలో ఇంటింటికి క్యాన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తుంటారు. కాగా బుధవారం ఉదయం చిన్న కుమారుడు నరేష్(17) ఇంట్లోనే ఉండగా రెండో కుమారుడు చిన్నా రోజుమాదిరిగా ఆటో తీసుకొని బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం భోజన సమయానికి తిరిగి ఇంటికి వచ్చిన చిన్నాకు ఇంట్లో గల ఫ్యాన్ కొక్కానికి నరేష్ తాడుతో ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ వెంకటయ్య ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తమ కుమారుడి మృతి పట్ల అనుమానం ఉందంటూ మృతుడి తండ్రి తిరుపతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.లక్ష విరాళం



ఎమ్మెల్యే సమక్షంలో చెక్కు అందజేస్తున్న వింజం రాజేంద్రప్రసాద్

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని కల్లెపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఆగ్రో ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వింజం రాజేంద్రప్రసాద్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు సమక్షంలో చెక్కును బీఆర్ఎస్ దామరచర్ల మండల నాయకుడు హాతీరాంనాయక్‌కు అందజేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం అందించిన వింజం రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మెల్యే భాస్కర్‌రావు అభినందించారు.

ఏకే ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న శ్రీధర్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కొంతకాలంగా ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని నాటా ప్రెసిడెంట్ డాక్టర్ కొరసపాటి శ్రీధర్ అన్నారు. అమెరికా దేశంలోని జార్జియాలో నాటా(ఉత్తర అమెరికా సమితి) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏకే ఫౌండేషన్ సేవలు వెలకట్టలేనివని, సేవా కార్యక్రమాలకు నాటా అసోసియేషన్ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రేటర్ అట్లాంటా తెలుగు అసోసియేషన్ ప్రెసిడెంట్ తంగిరాల సత్యనారాయణరెడ్డి, మేక గిరీష్‌రెడ్డి, సభ్యులు గుండెబోయిన శ్రీనయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కాంటా వేయాలని వినతి

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కాంటాలు వేయాలని సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ అన్నారు. ఈ మేరకు బుధవారం దామరచర్ల తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకొచ్చి చాలా రోజులువుతున్నా ఇప్పటివరకు అధికారులు కాంటాలు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ



సర్వాయి పాపన్న, ధర్మభిక్షం విగ్రహాలను ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

దేవరకొండ: మండలంలోని తాటికోల్‌లో సర్వాయి పాపన్నగౌడ్, బొమ్మగాని ధర్మభిక్షం గౌడ్ విగ్రహాలను తెలంగాణ గౌడ, గీత సంఘాల సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం గౌడ సంఘం నేతలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో చలమల అంజయ్యగౌడ్, జూలూరు ఆంజనేయులు, కోటేష్‌గౌడ్, విజయ్‌గౌడ్ శ్రీనివాస్‌గౌడ్, ఎల్లయ్యగౌడ్ తదితరులున్నారు.

ఇక సాఫీగా ప్రయాణం



గండ్రవానిగూడెం వద్ద కొనసాగుతున్న రోడ్డు మరమ్మతు పనులు



కుక్కడం-గండ్రవానిగూడెం మధ్య నిర్మించిన డబుల్ లైన్ సీసీ రోడ్డు

- కుక్కడం-పాములపహాడ్ రోడ్డుకు మరమ్మతులు
- 4 కిలోమీటర్ల మేర చకచకా కొనసాగుతున్న ప్యాచ్ వర్క్స్
- జూలైలోగా పూర్తి చేసేలా కసరత్తు

మాడుగులపల్లి: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. మాడుగులపల్లి మండలంలోని అనేక గ్రామాలకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి రోడ్లను నిర్మించిన ప్రభుత్వం.. మరమ్మతులనూ అదేస్థాయిలో నిర్వహిస్తోంది. కుక్కడం-పాములపహాడ్ మధ్య 17 కిలోమీటర్ల మేర సింగిల్ రోడ్డు ఉంది. చాలా ఏళ్లుగా ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పలుచోట్ల పూర్తిగా కంకర తేలి అధ్వానంగా మారింది. రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడిన పడ్డారు. దీంతో సమస్యను గుర్తించిన అధికారులు తక్షణ మరమ్మతులు చేయాలని ప్రభుత్వానికి నివేదించారు.

నాలుగు కిలోమీటర్ల మేర ప్యాచ్ వర్క్స్

రోడ్డు దెబ్బతిన్న పలు ప్రదేశాలను గుర్తించిన ఆర్అండ్‌బీ అధికారులు అక్కడ రోడ్డును పూర్తిగా తొలగించి కొత్తగా వేయాలని నిర్ణయించారు. ఇలా 17 కి.మీ.లలో 4కి.మీ. మేర పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించి మరమ్మతులకు సుమారు రూ.3.5 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వానికి అంచనాలు పంపారు. ఎమ్మెల్యే భాస్కర్‌రావు చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించడంతో మార్చి రెండో వారంలో పనులు ప్రారంభమయ్యాయి.

800మీ. మేర డబుల్ లైన్ సీసీ రోడ్డు నిర్మాణం

కుక్కడం నుంచి గండ్రవానిగూడెం గ్రామ శివారు వరకు చెరువు కట్ట ఉండడం.. కట్ట వెంటే రోడ్డు ఉండడంతో నీటి జాలు కారణంగా రోడ్డు పూర్తిగా దెబ్బతిని వర్షం వచ్చినప్పుడు బురదమయంగా తయారయ్యేది. దీనికి శాశ్వత పరిష్కారంగా కట్ట పొడవునా 800 మీటర్ల మేర డబుల్ లైన్ సీసీ రోడ్డును నెలరోజుల్లో నిర్మించారు. అదేవిధంగా ప్యాచ్ వర్క్స్‌ను కూడా అనుకున్న గడువు కంటే మూడు నెలల ముందే పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా గండ్రవారిగూడెం శివారు వరకు పాత రోడ్డును తొలగించి కంకర పరిచారు. దీనిపై బీటీ వేస్తే ఇక్కడి వరకు కిలోమీటర్‌కు పైగా రోడ్డు పూర్తయినట్లే. సీత్యాతండా, గణపతివారిగూడెం, దేవతలబావిగూడెం, పుచ్చకాయలగూడెం గ్రామాల్లో దెబ్బతిన్న చోట రోడ్డును తొలగించి కంకర పరుస్తున్నారు. వచ్చే నెల మొదటి వారంలోగా దీనిపై బీటీ వేయనున్నారు.

రాకపోకలకు ఇబ్బంది పడ్డాం

కుక్కడం నుంచి గండ్రవానిగూడెం వరకు రోడ్డు జాలు వారి పూర్తిగా దెబ్బతిని వర్షం వచ్చినప్పుడు గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు చాలా ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు డబుల్ లైన్ సీసీ రోడ్డు నిర్మించడంతో ప్రయాణం సాఫీగా మారింది. వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బంది ఉండదు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన అధికారులకు కృతజ్ఞతలు.

– బాబు, గండ్రవానిగూడెం

రెండు నెలల్లో పూర్తిచేస్తాం

రోడ్డు మరమ్మతు పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పనులు వేగవంతంగా చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. నాణ్యతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా మరమ్మతులు చేయిస్తున్నాం. జూలైలోగా పనులు పూర్తిచేస్తాం.

– దినేష్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈఈ, తిప్పర్తి

ట్రాలీ ఢీకొని వ్యక్తి మృతి

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా కంచికచర్ల మండలంలో ఘటన
- మృతుడు మిర్యాలగూడ వాసి

కంచికచర్ల(నందిగామ): వివాహ వేడుకకు హాజరయ్యేందుకు వెళ్తున్న వ్యక్తి ట్రాలీ ఢీకొని మృతిచెందిన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా కంచికచర్ల మండలంలోని కీసర సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ పెంటె సత్యవెంకట సుబ్రహ్మణ్యం కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని చైతన్యనగర్ నుంచి 35 మంది ఓ వ్యానులో కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని నందివాడలో జరిగే వివాహ వేడుకకు బయలుదేరారు. కంచికర్ల మండలంలోని కీసర సమీపంలో వ్యానును ఆపి జల్లూరు చింతాలు(47)తో పాటు మరో ముగ్గురు కిందికి దిగారు. ఆ నలుగురూ రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన ట్రాలీ చింతాలును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదాన్ని గుర్తించిన మిగిలిన ముగ్గురు పక్కకు పరిగెడుతూ రోడ్డుపై పడటంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు

- కొనుగోలు కేంద్రాలకు లారీలు రాక రైతుల తిప్పలు

హాలియా: అనుముల మండలంలోని ఐకేపీ, సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గత రెండు రోజులుగా ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా కొత్తపల్లి సొసైటీ ఆధ్వర్యంలో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభిస్తుందనే ఆశతో రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఆయా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చారు. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన, లారీల కొరతతో కాంటాలు వేయని సుమారు 26వేల బస్తాల ధాన్యం ఎగుమతి కాక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గత రెండు రోజులుగా లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక పక్క వాతావరణ పరిస్థితులు మారుతున్న కారణంగా కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో లారీలను రప్పించి ఐకేపీలో కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం ఎగుమతి జరిగేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

కొండమల్లేపల్లి: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి కోరారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంటింటికి సీపీఐ ప్రచార కార్యక్రమం 11వ రోజు బుధవారం మండలంలోని చిన్నఅడిశర్లపల్లి, డీఎం కుంట, చింతకుంట్ల, కొర్రతండా, ఫకీర్‌పురం, వర్ధమానిగూడెం, చెన్నమనేనిపల్లి, పెండ్లిపాకల, గుడితండా, చింతచెట్టుతండా, దోన్యాల, మల్లేపల్లి గ్రామాల్లో కొనసాగింది. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ మైనొద్దీన్, మండల కార్యదర్శి గుమ్మికొండ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

మాడుగులపల్లి: ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మాడుగులపల్లి ఎంపీపీ పోకల శ్రీవిద్యరాజు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అంతకుముందు పలుశాఖల ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని పలువురు సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ సమస్యలపైనా వాడీవేడి చర్చ జరిగింది. పాములపహాడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి సంజయ్ సీపీఆర్‌పై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. సమావేశంలో నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ రవి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



రైతులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి

డిండి: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామేపల్లిలో అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పంటను బుధవారం కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యయాదవ్‌తో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. ఫసల్ బీమా యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేయకపోవడంతో దాదాపు 54లక్షల రైతు కుటుంబాలు వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. మండలంలో ఎకరాకు రూ.20వేలు చొప్పున నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్, జిల్లా ప్రధానకార్యదర్శి చెనమోని రాములు, దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఏటి.కృష్ణ, మండలాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి, లాలూ నాయక్, నరసింహరావు, కొండలు, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

ప్రజలే.. మా బలం, బలగం: జూలకంటి



మిర్యాలగూడ: సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: ప్రజలే.. మా బలం, బలగమని, ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా ఉద్యమాలు చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన సీపీఎం నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ నాయకులు మత విద్వేషాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు మల్లు గౌతంరెడ్డి తదితరులున్నారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

మిర్యాలగూడ: జర్నలిస్టుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జూలకంటి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ జె. రాజు, కాంగ్రెస్ నాయకులు సిద్దునాయక్, పోలగాని వెంకటేశ్వర్లుగౌడ్, మాల మహానాడు జాతీయ నాయకుడు తాళ్లపల్లి రవి, బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దశరథ్‌నాయక్, ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ అంజాద్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు ఖాజా హమీదొద్దీన్, జిల్లా అధ్యక్షుడు అయూబ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు జి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కాంటాలను వేగవంతం చేయాలి..

వేములపల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలను వేగవంతం చేయాలని జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ గోవర్ధని, ఎంపీటీసీ చైతన్య, రైతు సంఘం నాయకులు పాల్వాయి రాంరెడ్డి, చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల బీజేపీ కార్యాలయంలో బుధవారం రాత్రి యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన 50 మంది పార్టీ మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్, ప్రముఖ సినీ నటి కవిత సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బాణావత్ రతన్‌సింగ్‌నాయక్ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే ఇతర పార్టీల నాయకులు బీజేపీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ప్రభారీ లచ్చిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడ్ల రమేష్, సీతారాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పులి విద్యాసాగర్ తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నిడమనూరు: మండల పరిధిలోని ఎర్రబెల్లి, గుంటిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సిరిగిరి శ్రీనివాసరెడ్డి, లకుమాల మధు, అశోక్, కోటిరెడ్డి, సీఈఓ జానయ్య ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

డిండి: మండల కేంద్రానికి చెందిన నారిమళ్ల ఈశ్వరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా డిండి యువత చేయూత కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో భాదమోని శ్రీనివాస్‌గౌడ్, ఏటి. కృష్ణ, నూకం వెంకటేష్, పున్న దినేష్, బల్మూరి సైదులు తదితరులు ఉన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం

మిర్యాలగూడ అర్బన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై సీపీఐ అలుపెరగని పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జన చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించే ధాన్యాన్ని నేరుగా ఎఫ్‌సీఐ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు బిల్లా కనకయ్య, లింగానాయక్, యాదగిరి, చంద్రమౌళి తదితరులున్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

త్రిపురారం: మండలంలోని కంపాసాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఎంపీపీ అనుముల పాండమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో త్రిపురారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శంకర్‌నాయక్, సర్పంచ్ అడివయ్య, వైస్ ఎంపీపీ మట్టయ్య, కోఆప్షన్ సభ్యుడు హుస్సేన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

హాలియా: మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట రెండో వార్డులో రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరవ సలహాదారు వెంపటి శంకరయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యడవెల్లి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, కోఆప్షన్ సభ్యుడు చాపల సైదులు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

చందంపేట: మండలంలోని పోలేపల్లి, గుంటిపల్లి గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను బుధవారం ఏఈఓ ప్రవీణ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేశారు. ఆయన వెంట గుంటిపల్లి సర్పంచ్ శంకర్‌రావు, కార్యదర్శులు ఉన్నారు.

బెల్లం పానకం ధ్వంసం

చందంపేట: మండలంలోని మానావత్‌తండా, కాత్రావత్‌తండా, పోలేపల్లిలో బుధవారం ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించి 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు 8లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు, చందంపేట ఎస్ఐ యాదయ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

మిర్యాలగూడ: ప్రొబేషనరీ కాలం ముగిసినప్పటికీ ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేయడం లేదని ఈ నెల 28 నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేయనున్నారు. ఈ మేరకు మిర్యాలగూడ మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నూకల సరళకు సమ్మె నోటీసు అందజేశారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం

గుర్రంపోడు: మండలంలోని కొప్పోలు గ్రామంలో బుధవారం ప్రముఖ రియల్టర్ వేనేపల్లి లక్ష్మణ్‌రావు, ఉదయశ్రీ దంపతుల ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి తర్వాత గ్రామంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం అన్నదానం నిర్వహించారు.

వీఓఏల వంటా వార్పు

పెద్దవూర: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం వంటా వార్పు నిర్వహించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సులుముల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

పెద్దవూర: రైతులు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మార్కెట్‌కు ధాన్యం పోటెత్తుతున్నా లారీలు సకాలంలో రాక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో దోరేపల్లి మల్లయ్య, దొంతాల నాగార్జున, రైతులు ఉన్నారు.

గౌరవ వేతనం అందించాలి

కొండమల్లేపల్లి: రేషన్ డీలర్లకు గౌరవ వేతనం అందించాలని డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన రేషన్ డీలర్ల డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మే 1న నార్కట్‌పల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి రేషన్ డీలర్ల సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పగిళ్ల వెంకటేశ్వర్లు, బాసిపాక వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

త్రిపురారం: నల్లగొండలో ఈ నెల 28న నిర్వహించే పూలే, అంబేడ్కర్ జన జాతర కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోలె రవి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దైద శ్రీను, మేకల వెంకన్న, శ్రీను, అవిరెండ్ల మనోజ్, సురేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ



గొట్టిముక్కలలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణలోని గ్రామాలకు మహర్దశ వచ్చిందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మన ప్రభుత్వం-మన పథకాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం దేవరకొండ మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో రూ.36లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.16లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. గొట్టిముక్కల రిజర్వాయర్ నిర్మాణంతో దేవరకొండ ప్రాంతం సస్యశ్యామలం కానుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, జెడ్పీటీసీ మారుపాకల అరుణ, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, ఎంపీడీఓ శర్మ, సర్పంచ్ అయ్యన్న, ఎంపీటీసీ గమ్లీబాయి, రవీందర్‌రెడ్డి, అనిత, యాదయ్య, చందు, పర్వతాలు, పద్మారెడ్డి తదితరులున్నారు.

ఈఎస్ఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఈఎస్ఐ వైద్య సేవలకు సంబంధించిన పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని వర్షిత హాస్పిటల్‌లో బుధవారం ఈఎస్ఐ వైద్య సేవలను మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. ఈఎస్ఐ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ఈఎస్ఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ఎక్కువగా పరిశ్రమలు ఉన్నాయని, అందులో పనిచేసే కార్మికులు అనారోగ్యం పాలైతే ఒక్క రూపాయి చెల్లించకుండా ఈఎస్ఐ ద్వారా ఉచిత వైద్యం అందుతుందని అన్నారు. అనంతరం వర్షిత ఆస్పత్రి వ్యవస్థాపక చైర్మన్ కూటాల రాంబాబు మాట్లాడుతూ.. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని, కార్మికుల కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఈఎస్ఐ వైద్య సేవలను ప్రారంభించినట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం



సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా: సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. బుధవారం హాలియా పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో పెద్దవూర, తిరుమలగిరి మండలాలకు చెందిన 43మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.14.59 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పిడిగం నాగయ్య, జటావత్ రవినాయక్, ప్రధాన కార్యదర్శి పోతుగంటి తిరుమల్, షేక్ బషీర్, నందికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ మంద రఘువీర్, సర్పంచ్‌లు బాలవర్ధిరాజు, శంకర్, నాయకులు కాటు కృష్ణ తదితరులు ఉన్నారు.

వచ్చే ఏడాది మే నాటికి పూర్తిచేస్తాం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): నెల్లికల్లు లిఫ్టును వచ్చే ఏడాది మే నాటికి పూర్తి చేసి సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే భగత్ అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు సమీపంలో చేపడుతున్న నెల్లికల్లు లిఫ్టు పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిడిగం నాగయ్య, ఎంపీటీసీ సుజాత, సర్పంచులు దేవుడునాయక్, స్వామి, మల్లికార్జున్, మార్కెట్ డైరెక్టర్ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మండలంలోని పిల్లిగుండ్లతండా సర్పంచ్ జటావత్ బాజు భర్త శంకర్‌నాయక్ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకోగా బుధవారం ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. నాయకునితండాకు చెందిన సఫావత్ జైలాల్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. జాల్‌తండాలో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో రైతులు జటావత్ మంగు, బాహోజి, భోజ, పాప, దీప్లాకు చెందిన పశుగ్రాసం దగ్ధం కాగా, బాధిత రైతులను ఎమ్మెల్యే పరామర్శించి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే పిల్లిగుండ్ల తండాలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు.

ధాన్యం కాంటాలు వేయడంలో నిర్లక్ష్యం



వెంకటాద్రిపాలెంలో జోడో యాత్ర నిర్వహిస్తున్న బీఎల్ఆర్, కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ: కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకొచ్చి చాలా రోజులవుతున్నప్పటికీ ప్రభుత్వం కాంటాలు వేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని మిర్యాలగూడ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చేపడుతున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర బుధవారం మిర్యాలగూడ మండలంలోని దుర్గానగర్, జంకుతండా, వెంకటాద్రిపాలెం, శ్రీనివాస్‌నగర్, సామగానితండా, తులసీతండా, లావూడితండా, రామన్నపేట గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండడంతో అకాల వర్షాలకు ధాన్యం తడుస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, నాయకులు పగుడుపటి సైదిరెడ్డి, మహేందర్‌నాయక్, రమేష్‌నాయక్, కిషన్, దేవోజినాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

దేవరకొండ: హైదరాబాద్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో మే 7న నిర్వహించనున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊదరి సైదులు పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. భరోసా సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరు కానున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ మండలాలకు చెందిన పలువురు బీఎస్పీలో చేరారు. అంతకు ముందు సభకు సంబంధించి వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు రమావత్ రమేశ్‌నాయక్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర కృష్ణ, మహిళా కన్వీనర్లు లలిత, సహాని తదితరులు పాల్గొన్నారు.